క్లుప్తంగా

నంది అవార్డు గ్రహీతకు అభినందన

ఖమ్మం మామిళ్లగూడెం: నంది అవార్డు అందుకున్న ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగి కూతురు కృష్ణమూర్తికి బుధవారం నెహ్రూనగర్‌లోని పెన్షనర్ భవన్‌లో రిటైర్డు ఉద్యోగులు ఘనంగా సత్కరించి అభినందించారు. హైదరాబాద్‌లోని బిర్లా మందిర్‌లో రుద్ర స్టూడియో ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్రస్థాయి ఏకపాత్రాభినయం పోటీల్లో కృష్ణమూర్తికి నంది అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, ఎం.సుబ్బయ్య, వేణు, నెహ్రూనగర్ బీ గ్రూప్ అధ్యక్ష, కార్యదర్శులు మారం రాజు, రాధా కృష్ణారావు, హనుమంతరావు, రమేశ్, టి.జనార్దన్ రావు, డీకే శర్మ, వెంకటేశ్వర్లు, సర్వర్ మియా, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


బానోత్ శ్రీనివాస్

తిరుమలాయపాలెం: ప్రైవేట్ విద్యా సంస్థల పాలేరు డివిజన్ నూతన కమిటీ కార్యదర్శిగా మండలంలోని దమ్మాయిగూడెం శ్రీ సరస్వతీ విద్యాలయం కరస్పాండెంట్ బానోత్ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలంలోని ది మెరిట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో యాజమాన్య ప్రతినిధులు కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. పాలేరు డివిజన్ అధ్యక్షుడిగా శివకృష్ణ, కోశాధికారిగా సీతారాములు, ఉపాధ్యక్షుడిగా ఉపేందర్, సలహాదారుడిగా శంకరయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు గుర్రం కాంతారావు కోశాధికారి నాసరయ్య, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘ జిల్లా బాధ్యులు ఇర్షాద్ నాగేశ్వరావు, నాగార్జున, శశిధర్‌రెడ్డి, పాలేరు డివిజన్‌లోని ప్రైవేట్ పాఠశాలల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యానికి హాజరైన 'తమ్మినేని'

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెంలో నూతన వధూవరులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆశీర్వదించారు. సీపీఎం నాయకుడు దుగ్గి వెంకటేశ్వర్లు మనవరాలిని పెళ్లి వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, గుడవర్తి నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేశ్, మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, బెల్లం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన

కామేపల్లి: పద్దెనిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ సుధాకర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో బీఎల్‌ఓలకు ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 2024 జనవరి 1 లోపు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదుతో పాటు సవరణలు సరిచూసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న శిక్షణ

కూసుమంచి: మండలంలోని పాలేరు పీ.వీ. నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మత్స్య కార్మికులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం బుధవారం రెండో రోజుకు చేరాయి. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. సీఫా పోర్టబుల్ ద్వారా తెల్లచేపలకు కృత్రిమ హార్మోన్ ఇంజక్షన్ ఇచ్చి తెల్ల చేపపిల్లలను ఉత్పత్తి చేసే విధానం గురించి వివరించారు. శాస్త్రవేత్త బి.రవీందర్, డాక్టర్ గణేశ్ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	యానిమల్
వినోద	హాయ్ నాన్న
సాయిరాం	పిండం, జోరుగా హుషారుగా
ఆదిత్య	యానిమల్
శ్రీనివాస	ఎక్స్ట్రార్డినరీ మ్యాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	34	బచ్చలికూర	3
వంకాయ	66		10
బెండకాయ	66	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	60	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	66	తోటకూర	3
దొండ	68		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	66	మెంతికూర	2
క్యాబేజీ	24		10
క్యాలీఫ్లవర్	36	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		30
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	56		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

వైరారోడ్డులో రోడ్డుపైనే పార్క్ చేసిన బైక్‌లు, కార్లు



ట్రాఫిక్.. టెన్షన్!

వైరా రోడ్డుపై అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

- నిరుపయోగంగా మారిన సెల్లార్లు
- కార్పొరేషన్ స్థలాల్లో పెయిడ్ పార్కింగ్
- ఆసక్తి చూపని వాహనదారులు
- ప్రత్యామ్నాయం చూపాలని పలువురి ఆవేదన
- చోద్యం చూస్తున్న అధికారులు, పాలకులు

అతి తక్కువ జనాభా ఉన్న పట్టణం నుంచి అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ.. నేడు సుమారు 5 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరంగా ఖమ్మం రూపాంతరం చెందింది. ఈనేపథ్యాన నగరంలో ఆస్పత్రులు, కళాశాలలు, షాపింగ్‌మాల్స్ ఎక్కువగా ఉండడంతో ఖమ్మం జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రానురాను నగరం విస్తరించడంతో పాటు వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. వీరికి సరైన పార్కింగ్ వసతులు లేకపోవడంతో రోడ్డుపైనే అస్తవ్యస్తంగా పార్కింగ్ చేయాల్సి వస్తోంది. దీంతో వాహనదారులకు పార్కింగ్ సమస్య రోజూ వేధిస్తోంది.


సెల్లార్‌కు తాళం వేసిన దృశ్యం

సాక్షి ఫోకస్

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని వైరా రోడ్డు పాత బస్టాండ్ నుంచి ఇల్లెందు క్రాస్ రోడ్డు వరకు, గాంధీచౌక్, కమాన్‌బజార్, కస్బాబజార్‌లలో నిత్యం జనాలతో రద్దీ ఉండడంతో వాహనాలను ఎక్కడ పార్క్ చేయాలో తెలియక, పార్కింగ్ స్థలం లేక ఇబ్బడిముబ్బడిగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో కనీసం పాదచారులు సరిగ్గా నడిచే పరిస్థితి లేక ఇబ్బంది పడుతున్నారు.

అస్తవ్యస్తంగా వాహనాలు..

నగరంలో అత్యంత రద్దీ రోడ్లలో వైరా రోడ్డు ఒకటి. ఈ రోడ్డులోనే ఆస్పత్రులు, బ్యాంకులు, కళాశాలలు, ఇతర వ్యాపార సముదాయాలు నెలకొని ఉండడంతో నిత్యం వేలాది మంది తమ అవసరాల నిమిత్తం కార్లు, ద్విచక్రవాహనాలపై వస్తుంటారు. ఉదయం 11 గంటల కల్లా వైరా రోడ్డు రెండు పక్కలా పూర్తిగా ద్విచక్రవాహనాలతో నిండిపోతుంది. ఇక గ్రామాలు, ఇతర పట్టణాల నుంచి అవసరాల నిమిత్తం ఖమ్మానికి వచ్చేవారి పరిస్థితి మరీ దారుణం. డ్రైవర్ లేకుండా ఖమ్మం వచ్చేవారి బాధలు వర్ణనాతీతం. వాహనం ఎక్కడ పార్క్ చేయాలో తెలియని గందరగోళ పరిస్థితి. ఎక్కడో ఖాళీగా ఉన్న చోట పార్క్ చేస్తే ట్రాఫిక్ పోలీసులతో చలాన్ల కష్టాలు మొదలవుతాయి. అత్యవసర పని ఉండి వాహనం పార్క్ చేసి వెళ్లే వచ్చే సరికి ట్రాఫిక్ పోలీసులు టోయింగ్ వాహనానికి కట్టి తమ ఇష్టానుసారంగా దాన్ని లాక్కెళ్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పడేస్తారు. ఇక తర్వాతి తంతు సరేసరి.

నిరుపయోగంగా సెల్లార్లు..

ఏదైనా వాణిజ్య సముదాయాన్ని నిర్మించాలంటే కచ్చితంగా సెట్‌బ్యాక్‌లు, సరైన పద్ధతిలో సెల్లార్లకు వదలడం తప్పనిసరి. మూడు లేదా అంతకంటే ఎక్కువ ఫ్లోర్‌లు కడితే తప్పనిసరిగా పార్కింగ్‌కు సెల్లార్ వదలాలనే నిబంధన ఉంది కానీ ఎవరూ పాటించడం లేదు. ఒకవేళ సెల్లార్ పార్కింగ్‌కు వదిలినా.. అందులో మెడికల్ ల్యాబ్, షాపులో పెట్టి నడుపుతుంటారు. దానిని కూడా పార్కింగ్‌కు ఉపయోగించరు. కొన్నిచోట్ల ఫుట్‌పాత్‌ను సైతం వాడుతూ జనరేటర్లు పెడుతున్నారు. వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయడంతో రోడ్డు కుంచించుకుపోయి రోడ్డుపై వెళ్లే వాహనాలు ఒక్కలైన్‌లోనే వెళ్లాల్సిన పరిస్థితి. బస్సులలో ఆస్పత్రులు, ఇతర పనులకు వచ్చేవారు దిగేందుకు బస్సులను రోడ్డుపై ఆపుతుండడంతో వాహనాలు వెళ్లేందుకు స్థలం లేక ట్రాఫిక్ జామ్ లాంటి సమస్యలు తలెత్తుతున్నాయి.


ఓ ఆస్పత్రి సెల్లార్‌లో కట్టిన గోడౌన్

కార్పొరేషన్ స్థలాల్లో పెయిడ్ పార్కింగ్..

కార్పొరేషన్ ఇటీవలి కాలంలో వైరారోడ్డులో ఉన్న చేపల మార్కెట్‌ను కూల్చివేశారు. ఆ స్థలాన్ని వాహనాల ఉచిత పార్కింగ్‌కు వినియోగిస్తే కొంతైనా సమస్య తీరేది. కానీ వారు ఆ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. వారు అందులో పెయిడ్ పార్కింగ్ పెట్టి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తుండడంతో వాహనదారులు అందులో తమ వాహనాలను పార్క్ చేసేందుకు విముఖత చూపుతున్నారు. దీంతో సమస్య రోజురోజుకు పెరుగుతుంది. ఇకనైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి నగరంలో పార్కింగ్ సమస్యను తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు.


ఓ ఆస్పత్రి ఎదుట పార్క్ చేసిన కార్లు

ప్రత్యామ్నాయం చూపాలి..



నగరంలో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. వైరారోడ్డు, గాంధీచౌక్, కమాన్‌బజార్, కస్బాబజార్ ఇలా ఎక్కడకు వెళ్లినా.. వాహనం ఎక్కడ పార్క్ చేయాలో తెలియని పరిస్థితి. ముఖ్యంగా పిల్లాపాపలతో కారులో బయటకు వస్తే కొద్దిసేపు ఎక్కడైనా పార్క్ చేసి వెళ్దామంటే వచ్చే సరికే వాహనం అక్కడ ఉండదు. ఒకవేళ ఉన్నా ఇక చాలాన్లు నేరుగా ఆన్‌లైన్‌లో వస్తుంటాయి. అధికారులు పార్కింగ్ సమస్యకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి.

– బాలబోయిన సందీప్, వాహనదారుడు

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ జెడ్ కమిటీ వేసి వర్గీకరణచేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు తప్పారని గుర్తు చేశారు. చట్టబద్ధత కల్పించలేని పక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటుతో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పాలడుగు జనార్దన్, గుడ్ల శ్రీను, నారాయణ, విజయ్, జిల్లా అధ్యక్షుడు దుపెల్లి శ్రీను, కోటేశ్వరావు, నాగమణి, ప్రకాశ్‌బాబు, వెంకన్న, ముత్తయ్య, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ

నేడు అవగాహన సదస్సు

రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వరం, చెరువుకొమ్ముతండా పంచాయతీల్లో నేడు(గురువారం) కేంద్ర ప్రభుత్వ పథకాలపై వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వాహనం ద్వారా అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివరించనున్నట్లు చెప్పారు.

విరాళాల సేకరణలో భాగస్వాములు కండి

నేలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీ విరాళాల సేకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పాలేరు సేవాదళ్ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 138వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయాన ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తుందని చెప్పారు. కానీ ప్రతిపక్షాలు ఇంకా అధికార పక్షంలోనే ఉన్నట్లు అహంకారంతో విమర్శలే పని పెట్టుకున్నట్లుగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమంలో ప్రతీ కార్యకర్త, పార్టీ అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, యడవల్లి నాగరాజు, మార్తి కోటి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పువ్వాడ దంపతుల సంతాపం


నివాళులర్పిస్తున్న పువ్వాడ దంపతులు

ఖమ్మంమయూరిసెంటర్: పువ్వాడ కృష్ణ సతీమణి పువ్వాడ పుష్పవతి దశదిన కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వసంతలక్ష్మి దంపతులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు. ఖమ్మంలోని పాత కలెక్టరేట్ వెనుక గల వారి నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీక్వెల్‌లో జరిగిన సంతాప సభకు హాజరై ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని స్మరించుకున్నారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, మేయర్ పునుకొల్లు నీరజ రాంబ్రహ్మం, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ తదితరులు ఉన్నారు.

వ్యాపారుల మృతికి పలువురి సంతాపం


నివాళులర్పిస్తున్న ఎర్రం బాలగంగాధరతిలక్

ఖమ్మంగాంధీచౌక్: అనారోగ్యంతో ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ దిగుమతి శాఖ సీనియర్ సభ్యుడు మిట్టపల్లి వెంకటేశ్వర్లు(75), వెండి బంగారం శాఖ సీనియర్ సభ్యుడు వంకాయల రాధాకృష్ణ(60) మరణించగా.. బుధవారం పలువురు వ్యాపార ప్రతినిధులు మృతదేహం వద్ద నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు సోమ నర్సింహారావు, కోశాధికారి తల్లాడ రమేశ్, సెంట్రల్ ఈసీ సభ్యులు వేణు గోపాల్‌రావు, శ్రీనివాసరావులతో పాటు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మేడబోయిన లింగయ్య, ఎర్రం బాల గంగాధర్ తిలక్, బంధు సూర్యం, చింతల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఫాసిస్ట్ విధానాలపై యువత ఉద్యమించాలి

ఖమ్మంమయూరిసెంటర్: హిందుత్వ ముసుగులో దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఫాసిస్ట్ విధానాలపై యువత ఉద్యమించాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇందూరు సాగర్, కోలా లక్ష్మీ నారాయణ అన్నారు. బుధవారం ఖమ్మంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన పీవైఎల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ తన పదేళ్ల పాలనలో అన్ని రంగాలను దివాళా తీయించిందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం ఫాసిస్ట్ చర్యలతో ప్రజాస్వామిక, దళిత, బహుజన, మైనార్టీలపై నిర్బంధాన్ని తీవ్రతరం చేసిందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు బేతంపూడి నాగరాజు, ఉపేందర్, శ్రీకాంత్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి

తిరుమలాయపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఫలితంగా ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఆటో వర్కర్ల యూనియన్ ఖమ్మం జిల్లా ఇఫ్టూ నాయకులు పోలెబోయిన వీరబాబు కోరారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత బస్సు సౌకర్యం కారణంగా రోజు కనీసం రెండు, మూడు వందలు రూపాయలు కూడా వచ్చే పరిస్థితి లేదని, లోన్లు, ఫైనాన్స్, కిస్తీలు చెల్లించలేకపోతున్నారని, దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆటోవాలాలా అప్పులు చెల్లించడంతో పాటు ఆర్టీఓ ఆఫీసులో బ్రేక్ చార్జీలు చెల్లించడం లేదా రద్దు చేసి ఆదుకోవాలని కోరారు.

'ఔట్ పోస్ట్'తో ఆకతాయిల అడ్డుకట్ట

ఖమ్మంక్రైం: నిత్యం రద్దీగా ఉండే పాత ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్ పోస్ట్ కేంద్రాన్ని బుధవారం ఏసీపీ హరికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో ఆకతాయిలు పాత బస్టాండ్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయని, వీటికి స్వస్తి పలకకపోతే నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా, బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ గస్తీ ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ స్వామి పాల్గొన్నారు.


ఔట్ పోస్టును ప్రారంభిస్తున్న ఏసీపీ హరికృష్ణ

విద్యార్థులను విజ్ఞానపరంగా ప్రేరణ చేయాలి


ప్రదర్శనలను తిలకిస్తున్న డీఈఓ, యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులను విజ్ఞానపరంగా నిత్యం ప్రేరణ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఇన్‌స్పైర్ ఎక్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచే విద్యార్థులను విజ్ఞాన పోటీ ప్రపంచంలో ముందుండేలా తీర్చిదిద్దాలన్నారు. ఇన్‌స్పైర్‌లో విద్యార్థులు వివిధ అంశాలపై ప్రదర్శించిన నమూనాలు వారి ప్రతిభకు దర్పణం పడుతున్నాయన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ సుకన్యలు మాట్లాడుతూ పాఠశాలలో ప్రతి సంవత్సరం ఇన్‌స్పైర్ ఎక్స్‌పోను నిర్వహిస్తూ విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీస్తున్నామన్నారు. కాగా, అణువు నుంచి అంతరిక్షం దాకా విద్యార్థులు 200లకు పైగా నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయం ఏపీఓ నరుకుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ' సెక్రటరీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న ధాత్రి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రికి తమిళనాడు ప్రభుత్వం ఆధ్వర్యాన ఐసీటీ అకాడమీ వారు ఉత్తమ ఎంటర్ ప్రైజింగ్ ఎంటర్ ట్రైనర్ అవార్డు లభించింది. 2022–23వ విద్యా సంవత్సరానికి గాను బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఐసీటీ అకాడమీ 55వ ఎడిషన్ బ్రిడ్జ్–2023 సదస్సులో పరిశ్రమలు కళాశాల పరస్పర చర్యల ఒప్పందంలో భాగంగా ధాత్రికి అవార్డును ప్రదానం చేశారని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. సదస్సులో ఈ బ్రిడ్జ్ ఈవెంట్ ముఖ్య ఉద్దేశం, పరిశ్రమలకు– కళాశాలలకు మధ్య సయన్వయం ఏర్పరచడం, పరిశ్రమలకు, కళాశాలలకు కావాల్సిన వనరుల ఏర్పాటులో తోడ్పాటు, విద్యార్థుల నియామక లక్షణాలు, అవకాశాల కల్పనలో తోడ్పాటు అందించడమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ పరిశ్రమలతో తమ కళాశాల అధికారక ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఈమేరకు ధాత్రికి అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బిందాజ్ తదితరులు అభినందనలు తెలిపారు.

గణిత సామర్థ్యాల పెంపునకు వేదిక్ మ్యాథ్స్


మాట్లాడుతున్న డీడీ విజయలక్ష్మి

ఖమ్మంరూరల్: తక్కువ సమయంలో గణిత సామర్థ్యాలను పెంపొందించడానికి వేదిక మ్యాథ్స్ ఉపయోగపడుతుందని ఖమ్మం మైదాన డీడీ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండంలోని గొల్లగూడెంలోని ప్రభుత్వ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో మూడు నెలల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలు, సామాజిక చైతన్యం పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ జహరుద్దీన్, మురహరి, నిహారిక, వి.ప్రసాద్, బాల తదితరులు పాల్గొన్నారు.

'త్రివేణి'లో మ్యాథ్స్ ఫెస్ట్

ఖమ్మం సహకారనగర్: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని బుధవారం నగరంలోని త్రివేణి పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు త్రివేణి పాఠశాలల డైరెక్టర్ వీరేంద్రచౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. రామానుజన్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం ఈ నెల 18వ తేదీన వ్యాసరచన, 19న వకృత్వ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. అలాగే ఈ నెల 21న మాథ్స్ ఎగ్జిబిషన్, 22న మాథ్స్ క్విజ్, గణిత ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, త్రివేణి పాఠశాలల అధిపతి వై.వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల బాధ్యులు మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండలో కిసాన్ మోర్చా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్‌గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, షేక్ మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకు బయలుదేరిన మాలధారులు

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లకు చెందిన అయ్యప్ప మాలధారులు బుధవారం ఇరుముడితో శబరిమలైకు తరలివెళ్లారు. గురు స్వాముల ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించాక రైలు ప్రయాణంలో తరలివెళ్తున్నట్లు మాలధారులు తెలిపారు.

యూటీఎస్ యాప్‌పై అవగాహన

ఖమ్మం మామిళ్లగూడెం: అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్(యూటీఎస్) యాప్‌పై ఖమ్మం రైల్వేస్టేషన్‌లో బుధవారం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.ఈ మేరకు రిజర్వ్ చేయని రైలు టికెట్‌లను రూపొందించడం, సీజనల్ టికెట్ బుక్ చేయడం, పాస్‌లను పునరుద్ధరించడం, ప్లాట్ ఫాం టికెట్ కొనుగోలు, మొబైల్ అప్లికేషన్ టికెట్లు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీసీఐ జాఫర్ మాట్లాడుతూ.. ఇక టికెట్ కోసం క్యూలో నిల్చోవాల్సిన పనిలేదని, అధికారిక యూటీఎస్ యాప్‌ను ఉపయోగించి ప్రయాణికులు ఐదు రకాల రైలు టికెట్లను బుక్ చేసుకోవచ్చన్నారు. అనంతరం యాప్ డౌన్‌లోడ్ గురించి ప్రయాణికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీబీఎస్ఆర్ జె.వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణ, నాగిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అటెన్షన్ ప్లీజ్

కంపు కొడుతోంది..!

కూసుమంచి మండల కేంద్రంలోని పాలేరు రోడ్డులో మురుగు కాల్వల్లో చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు ఇదిగో ఇలా పేరుకుపోయాయి. దీంతో మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక దుర్గంధం వెదజల్లుతూ.. ఈ ప్రాంతవాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ కాల్వ సమీపంలోనే దుకాణాలు, హోటళ్లు కూడా ఉండడంతో ఇక్కడకు వచ్చే వారు మురుగుకంపు భరించలేకపోతున్నారని, తమకు రోగాలు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా గ్రామ పంచాయతీ వారు స్పందించి మురుగును తొలగించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

- కూసుమంచి

